telugubooks

# ఎలుగు విందు

మూడు ఎలుగు బంట్లు కలిసి ఒక చోట జీవిస్తున్నాయి. వాటిలో ఒకటి చాలా పెద్దది, రెండోది మధ్య రకంది, మూడోది చాలా చిన్నది! మూడు అన్ని సౌకర్యాలూ కల్పించుకుని ఓ చక్కటి ఇంట్లో ఉంటున్నాయి. అక్కడ ఎవరి కుర్చీలు, పక్కలు వారివే!

ఒక రోజున అవి విందు కోసం ఘుమఘుమలాడే పాయసాన్ని తయారు చేసుకున్నాయి. వేడిగా ఉండడంతో మూడు పాత్రలలోను పోసుకొని, భోజనం బల్ల మీద చల్లారడానికి పెట్టి, అలా బయటికి వెళ్ళివద్దామని బయలు దేరాయి.

ఇంతలో ఓ పాప ఆడుకుంటూ అటుగా వచ్చింది. ఆ ఇంట్లోంచి వస్తున్న వాసనలకి ఆమె నోరూరింది.

ఆ ఇంట్లో ఎవరు ఉంటున్నారో చూద్దామని కిటికి దగ్గరికి వచ్చి లోపలికి తొంగిచూసింది. భోజనపు బల్ల మీద పాయసంతో పాత్రలు కనిపిస్తున్నాయి. కాని ఎవరూ ఉన్నట్లు కనిపించడం లేదు.



నెమ్మదిగా లోపలికి వచ్చింది. పెద్ద పాత్రలో ఉన్న పాయసం వేడిగా అనిపించింది. చిన్న ఎలుగు పాత్రలో ఉన్న పాయాసం చల్లారిపోయింది. అందుకని మధ్య పాత్రలో పాయసాన్ని శుభ్రంగా తిన్నది. కూర్చుని తినడానికి కూడా మూడు ఎలుగు బంట్ల కుర్చీలను పరీక్షించి, మధ్య ఎలుగు బంటి కుర్చీ మీదే కూర్చుంది.

తిన్న తర్వాత నిద్రవస్తున్నట్లనిపించి పడక గది వైపు దారి తీసింది. అక్కడ కూడా మూడు పరుపుల్ని పరీక్షించింది. మధ్య దాని పక్క మీద పడుకోవడమే హాయనిపించింది. పడుకుంది. అంతే! ఠక్కున నిద్ర పట్టేసింది.

బయటికి వెళ్ళిన మూడు ఎలుగు బంట్లు తిరిగి వచ్చాయి. పాయ సాన్ని తిందామని భోజనపు బల్ల దగ్గరికి వెళ్ళే సరికి ఎవరో తమ పాత్రల్ని కదిలించినట్లు వాటికి అనిపించింది.

"నా పాత్రలోని పాయసాన్ని ఎవరో తినేశారు" కంగారుగా అంది మధ్య రకం ఎలుగు.

"అంతే కాదు మా పాత్రల్ని కూడా కదిలించారు"కదిలినపాత్రల్ని గమనిస్తూ అంది పెద్ద ఎలుగు.

"మన కుర్చీలన్నీ కూడా ఎలా కదిలించారో చూడండి". బుంగ మూతి పెట్టి అండి చిన్న ఎలుగు

తాము ఇంట్లో లేనప్పుడు ఎవరొచ్చారో తెలుసుకోవాలని మూడు ఎలుగు బంట్లు వెదకసాగాయి.

ఆఖరికి పడక గదిని చేరుకొన్నాయి.

"మనపరుపుల్నికూడాకదిలించారు" పెద్ద ఎలుగుకి కోపం వచ్చింది.

"నిజమే!" వంత పాడింది చిన్న ఎలుగు.

"నా పక్క మీద ఎవరో పడుకుని ఉన్నారు" మధ్య ఎలుగు కీచు గొంతుతో అంది. వాటి మాటలకి పరుపు మీద పడుకున్న పాపకు చటుక్కున మెలుకువ వచ్చింది. కళ్ళు తెరిచి చూసింది.

ఎదురుగా మూడు ఎలుగు బంట్లు!

భయంతో వణికిపోయింది.

ఒకసారి బిక్కుబిక్కు మంటూ చుట్టూ చూసింది. గాలి కోసం తెరిచి ఉన్న కిటికీ కనిపించింది.

పైకిలేచి చటుక్కున ఆ కిటికీలోంచి బయటికి దూకి పరుగు లంకించుకుంది పాప. అంతే! ఆ తర్వాత మళ్ళీ ఎప్పుడూ ఎలుగు బంట్లు ఉండే ఇంటి వైపు పోలేదు ఆ పాప.

క్రొత్త ప్రదేశాలకి వెళ్ళినప్పుడు పరిసరాల్ని జాగ్రత్తగా గమనించి మసలుకోవాలి!

Stories for kids- Hudnreds of telugu books.. Just a click away- www.telugubooks.tk
Listen telugu audio books online.
Free telugu books. Telugu Pdf books online…